క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్ : హైదరాబాద్‌లో ఈనెల 26 నుంచి నిర్వహించే 41వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల టెన్నీకాయిట్ పోటీల ఎంపికలను శుక్రవారం జేఎన్ఎస్‌లో నిర్వహించారు. 50 మంది బాలికలు, 50 మంది బాలురు పాల్గొన్నారు. కార్యక్రమంలో టెన్నీకాయిట్ వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు గోకారపు శ్యాంకుమార్, అల్వాల రాజ్‌కుమార్, కోశాధికారి జహూర్, పీఈటీ పాల్గొన్నారు.

సివిల్ ఇంజనీరింగ్ బీఓఎస్‌గా రాధిక



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.రాధికను నియమించారు. కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాధిక ప్రస్తుతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీసీ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 25న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. విష్ణుపురి కాలనీ, పోలీస్‌స్టేషన్, సాయి షాపూర్‌జీ కాంప్లెక్స్, సోమిడి, రహమత్‌నగర్, జూబ్లీ మార్కెట్, వెంకటాద్రినగర్, కాజీపేట మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

27న జరగాల్సిన జర్నలిజం రెండో పేపర్ వాయిదా

కేయూ క్యాంపస్ : యూజీఈ-నెట్ పరీక్ష దృష్ట్యా ఈనెల 27న జరగాల్సిన కాకతీయ యూనివర్సిటీ ఎంఏ (జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) మూడో సెమిస్టర్ రెండో పేపర్ వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఫిబ్రవరి 5న నిర్వహిస్తామని తెలిపారు. మిగతా పేపర్లు యథావిధిగా టైంటేబుల్ ప్రకారం జరుగుతాయని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



వరంగల్ అర్బన్ : హనుమకొండ హంటర్ రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్‌కు సమీపంలోని సర్వే నంబర్ 125/సీ లో అక్రమ నిర్మాణాన్ని బల్దియా అధికారులు కూల్చివేశారు. నగరంలో బడా వ్యాపారవేత్త, ఓ సామాజిక ఉద్యమకారుడి మధ్య నెలకొన్న ఈ భూ వివాదంలో హైకోర్టు ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు.హైకోర్టు ఉత్తర్వుల మేరకే నిర్మాణాలను కూల్చివేసినట్లు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

ఐఎన్‌టీయూసీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

వరంగల్ లీగల్ : ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ వరంగల్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా న్యాయవాది అనుమాండ్ల రాజ్‌కుమార్‌ను నియమిస్తూ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురహరి బుద్దారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడి అధ్వర్యంలో అధ్యక్షుడు రాజ్‌కుమార్ జిల్లా కమిటీ వేశారు. ఉపాధ్యక్షుడిగా విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా పొలాస శివకుమార్, ఆర్గనైజింగ్ సభ్యుడిగా భూక్యా రమేశ్‌లను నియమించగా వారికి బుద్దారం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ నరసింహారాములు, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ మణికంఠ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శరణ్యారెడ్డి, ఉపాధ్యక్షులు రాజు, పాల్గొన్నారు.

శాశ్వత భవనం నిర్మించాలి

ఖిలా వరంగల్ : డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలని పర్యాటకశాఖ మంత్రి కొండా సురేఖకు వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వరంగల్ శంభునిపేటలో శుక్రవారం జరిగిన బాలికల దినోత్సవం వేడుకల్లో మంత్రి సురేఖ రాగా ఆమెకు వినతిపత్రం అందజేయడంతో పరిశీలిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

లీకేజీ పనులకు మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

కాజీపేట రూరల్ : బాపూజీనగర్‌లో సమస్యలు తిష్ట అనే శీర్షికన సాక్షిలో ఈ నెల 22న ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. ఈ మేరకు మున్సిపల్ అధికారులు స్పందించి కాజీపేట-హైదరాబాద్ నేషనల్ హైవే రోడ్డు మార్గంలోని బాలాజీనగర్‌కు వెళ్లే మార్గం సమీపంలో మెయిన్‌రోడ్ పక్కన గల మున్సిపల్ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు ప్రారంభించారు.

మార్కెట్‌లో వసూళ్ల ‘బహదూర్’లు

- చిల్లర వ్యాపారుల వద్ద నిత్యం వసూళ్లే
- మార్కెట్ ఫీజు పేర గుంజుతున్న వైనం
- మార్కెట్ కార్యదర్శి సందర్శనలో వెల్లడైన వసూళ్ల వ్యవహారం?



మార్కెట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న మార్కెట్ కార్యదర్శి నిర్మల

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురం మోడల్ మార్కెట్‌లో విధుల నిర్వహణ కోసం మార్కెట్ కమిటీ అధికారులు నియమిస్తున్న ఉద్యోగులు ‘బహదూర్’గా పాల్పడుతుండడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. ఎవరినీ నియమించినా నాలుగు రోజులు విధులు నిర్వహించి అక్రమ వసూళ్లకు తెర లేపుతున్నారు. ఇలా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఉద్యోగులపై కఠిన చర్యలు లేక పోవడంతో భయంలేకుండా ఈ వ్యవహారం సాగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోడల్ మార్కెట్‌గా మారిన సమయంలో ప్లాట్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు రావడంతో అప్పటి వారిని మార్చి కొత్త వారిని నియమించారు. కొత్తగా వచ్చిన విధుల్లోకి వచ్చిన వారు సైతం అదే పద్ధతిలో వసూళ్లకు తెగపడడంతో మార్కెటింగ్ అధికారులు జుట్టు పీక్కుంటున్నారు. తాజాగా కూరగాయల మార్కెట్‌కు సూపర్‌వైజర్‌గా నియమించినా ఆయన ఇక్కడకు రాకుండా గ్రేయిన్ మార్కెట్‌లోని మిర్చి యార్డులో విధులు నిర్వర్తిస్తున్నాడు. సూపర్‌వైజర్లు తక్కువ ఉన్నందున అక్కడ పనిచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయనకు సహాయంగా ఇటీవల బదిలీపై వచ్చిన సూపర్‌వైజర్‌ను నియమించడంతో పేనుకు పెత్తనం ఇచ్చినట్లు అయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్ ఫీజులు కమీషన్ వ్యాపారులు కార్యాలయానికి వచ్చి కట్టాల్సి ఉంటుంది. వీరి అలసత్వంతో కట్టక పోవడంతో కిందిస్థాయి ఉద్యోగులను వారి వద్దకు పంపాల్సి ఉంటుంది. కాని మార్కెట్‌లో మార్కెట్ ఫీజుల పేరుతో ఒక ఉద్యోగి మార్కెట్‌లో చిల్లర అమ్మకాలు చేస్తున్న వ్యాపారుల వద్ద రెండు, మూడు రోజులకోసారి కొంత మొత్తంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సదరు ఉద్యోగి డబ్బులు లేవు అంటే ఫోన్‌పేలో కొట్టండని కొట్టించుకున్నారు. ఇచ్చిన డబ్బులకు రశీదు ఇవ్వమంటే మీరు లెక్క ప్రకారం రూ.5వేల వరకు మార్కెట్ ఫీజు కట్టాలి. ఇచ్చిన రూ.వేయికి ఇవ్వలేమంటూ దాట వేస్తున్నట్లు తెలిసింది. అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసునేందుకు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్న సాకుతో అధికారులు వారిని కాపాడడంతో ఈ దందా కూరగాయల మార్కెట్‌లో మూడు పువ్వులు.. ఆరు కాయలుగాా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ పైఅధికారులు ఇలా వసూళ్లకు పాల్పడుతుండడంతో కింది స్థాయి ఉద్యోగులు చిల్లర వ్యాపారుల వద్ద కూరగాయలు సేకరిస్తూ వారు ఎక్కడ కూర్చున్నా...ఎంత వైశాల్యంలో దుకాణాలు పెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయం ఆ నోట ఈ నోట ప్రచారం కావడంతో శుక్రవారం ఉదయం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, గ్రేడ్ 2 అంజిత్ రావు, ఏఎస్ రాజేందర్‌లు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయడంతో అక్రమ వసూళ్లు జరిగినట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. సదరు ఉద్యోగికి మెమో జారీ చేసేందుకు రంగం సిద్ధం అయినట్లు సమాచారం.

అడ్తిదారులకు టీడీఎస్ మినహాయించాలి

- ఐటీ పీసీసీకి చాంబర్ ప్రతినిధుల వినతి



ఇన్‌కంట్యాక్స్ పీసీసీ మధుస్మితకు వినతి పత్రం అందజేస్తున్న చాంబర్ అడ్తి సెక్షన్ల ప్రతినిధులు

వరంగల్: మార్కెట్లలోని పంట ఉత్పత్తుల అమ్మకాలు, కొనుగోళ్లలో రైతులకు, వ్యాపారులకు మధ్యవర్తులుగా ఉన్న కమీషన్(అడ్తి)వ్యాపారులకు 194 క్యూ సెక్షన్ ప్రకారం టీడీఎస్(ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) వర్తించదని, దీంతో వారికి ఇన్‌కం ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ మార్కెట్ యార్డ్స్ అడ్తి అండ్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కటకం పెంటయ్య, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎన్‌రెడ్డి లింగారెడ్డి, చిల్లీస్ సెక్షన్ అధ్యక్షులు రాజేష్, డి.కరాణిలో కోరారు. శుక్రవారం తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుస్మితను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాంబర్ ప్రతినిధులు మాట్లాడుతూ అడ్తిదారులకు టీడీఎస్ విధించడం న్యాయసమ్మతం కాదన్నారు. రైతుల ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో సహకరిస్తూ కమీషన్ మాత్రమే రైతుల నుంచి తీసుకుంటున్నందున ఈ నిబంధన వర్తించదన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మధుస్మిత మాట్లాడుతూ త్వరలో తగిన నిర్ణయం తీసుకొని స్పష్టత ఇస్తూ ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు చాంబర్ అడ్తి సెక్షన్ ప్రతినిధులు తెలిపారు.

రాష్ట్ర సదస్సుకు తరలిరావాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

హన్మకొండ: హసన్‌పర్తి ఎర్రగట్టు గుట్టలో నేడు (శనివారం) జరిగే భారత రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్ర స్థాయి సదస్సుకు అన్ని వర్గాల వారు తరలివచ్చి విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన హనుమకొండలో మాట్లాడుతూ సదస్సుకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ బాస్కర్, డీబీఎఫ్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, ప్రొఫెసర్ రమ, ఎర్రగట్టు స్వామి పాల్గొంటారని వివరించారు. సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం ద్వారానే బీసీలకు విముక్తి

- బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు



సదస్సులో మాట్లాడుతున్న చిరంజీవులు

హన్మకొండ : రాజ్యాధికారం ద్వారానే బీసీ సమాజ విముక్తి సాధ్యమని, రాజకీయ చైతన్యం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు అన్నారు. భారత రత్న, జననాయక్ కర్పూరి ఠాకూర్ 102వ జయంతి సందర్భంగా ×స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల పాత్ర అనే అంశంపై నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సదస్సు జరిగింది. సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా కోసం ఉద్యమిస్తున్న బీసీలు ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలను వీడాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో మెజార్టీ సీట్లను బీసీలు గెలవడమే లక్ష్యంగా ఫోరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, డాక్టర్ తిరునహరి శేషు, డాక్టర్ రమేష్, గొల్లపెల్లి వీరస్వామి, డాక్టర్ వీరస్వామి, ప్రొఫెసర్లు కూరపాటి వెంకటనారాయణ, దినేష్, విజయ్ బాబు, దిగంబర్ రావు, సుందర్ రాజ్ యాదవ్, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ శ్రీలత, సాయిని స్వప్నిల్, రాచకొండ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులపై బీసీ నాయకుల అసహనం

హరిత హోటల్‌లో బీసీల ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిర్వాహకులపై కుల, వృత్తి సంఘాల నాయకులు అసహనం వ్యక్తం చేశారు. తమను పిలిచి అవమానించారని, తమను వేదికపై ఎందుకు పిలువరని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకుడు టి.చిరంజీవి జోక్యం చేసుకుంటూ ఇలాగైతే తమ లక్ష్యాన్ని సాధించలేమని, బీసీలంత సంఘటితంగా ఉద్యమిద్దామని, ఎలాంటి అపోహలకు తావు ఇవ్వరాదని సర్దిచెప్పారు. దీంతో పరిస్థితి చల్లబడింది.

యాదవనగర్‌లో ఫ్లెక్సీ లొల్లి

హన్మకొండ చౌరస్తా : కార్పొరేటర్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారి తీసింది. చిలికిచిలికి గాలివాన మాదిరిగా మాటల యుద్ధం కాస్త దాడులు చేసుకునే వరకు వెళ్లింది. స్థానికులు కలుగజేసుకుని గొడవను సద్దుమణిగేలా చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్ పుట్టినరోజు శుక్రవారం కావడంతో ఆయన అభిమానులు యాదవనగర్‌లో మూలమలుపు వద్ద శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే అప్పటికే అదే స్థానంలో సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బాషబోయిన శ్రీధర్‌యాదవ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఉంది. బీఆర్ఎస్ డివిజన్ నాయకులు కాంగ్రెస్ ఫ్లెక్సీని తొలగించి కార్పొరేటర్‌కు శుభాకాంక్షల ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న శ్రీధర్‌యాదవ్ అక్కడికి చేరుకుని తమ ఫ్లెక్సీని ఎందుకు తొలగించారని వాగ్వాదానికి దిగాడు. సంక్రాంతి అయిపోయాక ఫ్లెక్సీ ఎందుకని అక్కడే ఉన్న కార్పొరేటర్ అశోక్‌యాదవ్ సమాధానం చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆగ్రహంతో కార్పొరేటర్‌పై దాడి చేసేందుకు శ్రీధర్‌యాదవ్ దూసుకెళ్లగా అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకుని గొడవను సద్దుమణిగేలా చేశారు.

సంక్షిప్త సమాచారం

క్రీడాసాంస్కృతిక పోటీలో విద్యార్థుల ప్రతిభ



మడికొండ: కాజీపేట మండల స్థాయి క్రీడా సాంస్కృతిక పోటీలో మడికొండ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను కనబరిచినట్లు హెచ్ఎం మల్లారెడ్డి తెలిపారు. విద్యార్థులు రెండు రోజులుగా పోటీలు కుమ్మరిగూడెంలో జరుగుతుండగా పాఠశాల నుంచి పాల్గొన్న బాలురు కబడ్డీ పోటీలో ప్రథమ బహుమతి, బాలికలు ద్వితీయ బహుమతి పొంది వారి ప్రతిభను కనబరిచారు. సాంస్కృతిక కార్యక్రమంలో గ్రూపు డ్యాన్స్‌లో బాలికలు ప్రథమ బహుమతి, సోలో డాన్స్‌లో ద్వితీయ బహుమతి పొందారు.

అంబేడ్కర్‌నగర్‌లో ఇంటింటి ర్యాలీ

కాజీపేట : గ్రేటర్‌లోని 3వ డివిజన్ అంబేడ్కర్‌నగర్ కాలనీలో శుక్రవారం మాదిగ మహాజనుల వేదిక ఆధ్వర్యంలో వర్గీకరణకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు.

మహాప్రదర్శనకు న్యాయవాదుల సంఘీభావం

వరంగల్ లీగల్ : ‘వెయ్యి గొంతులు -లక్ష డప్పులు’ పేరుతో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగనున్న ఎమ్మార్పీఎస్ సాంస్కృతిక మహా ప్రదర్శన సంఘీభావంగా ఉభయ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, రమేష్‌బాబు నేతృత్వంలో న్యాయవాదులు డప్పు దరువులతో ప్రదర్శన నిర్వహించి వర్గీకరణ ఉద్యమం న్యాయమైనదని, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఖిలా వరంగల్: రహదారులపై ట్రాఫిక్ నింబంధనలు తప్పనిసరిగా పాటించాలని మట్టెవాడ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం వరంగల్ ఉర్సు గుట్ట తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర రావు అధ్యక్షతన రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరిగాయి.

కాజీపేట జంక్షన్‌లో పోలీసుల తనిఖీలు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శుక్రవారం ముందస్తు జాగ్రత్తగా బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టింది. ప్లాట్ ఫాంలు, స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద, ప్రయాణికుల వేచి ఉండు గదులు, అనుమానాస్పద ప్రయాణికులను, వస్తువులు, లగేజీలను తనిఖీ చేపట్టారు.

బీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడిగా సాయినాథ్

కాజీపేట రూరల్ : కాజీపేట బోడగుట్టకు చెందిన వలిశెట్టి సాయినాథ్ పటేల్ కాంగ్రెస్ బీసీ సెల్ 47వ డివిజన్ అధ్యక్షుడుగా నియామకమయ్యారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మతి విక్రమ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అజ్గర్ ఆధ్వర్యంలో నియామక ప్రతం అందజేశారు.

అనారోగ్యంతో ఎంఈఓ మృతి

హసన్‌పర్తి/విద్యారణ్యపురి : హసన్‌పర్తి విద్యాశాఖాధికాధికారి రవీందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచాడు. ఆరునెలల క్రితమే రవీందర్ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. రవీందర్ స్వస్థలం సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట గ్రామం. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పలువురి నివాళి

రవీందర్ మృతి పట్ల జిల్లా విద్యాశాఖ అధికారిణి వాసంతి, ఎంపీడీఓ కర్నాకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, ఏఓ అనురాధ, ఉపాధ్యాయల సంఘాల బాధ్యులు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు రవీందర్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

లలిత కళలు మానసిక ఉల్లాసానికి దోహదం

కేయూ క్యాంపస్ : లలిత కళలు మానసిక ఉల్లాసానికి మనిషి ఎదుగుదలకు దోహదం చేస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ డైట్‌లోని హాల్‌లో రెండు రోజుల పాటు విద్యార్థులకు దేశభక్తిపాటల శిక్షణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ముగిసింది.

‘కేవీ’లో పరీక్ష పే చర్చ

కాజీపేట అర్బన్ : మండలంలోని కడిపికొండ పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి నగరంలో 11 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్ హై హమ్ వీడియో ప్రదర్శనను ప్రదర్శించి విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రథమ బహుమతి కేవీకి చెందిన ఆర్.సుదీత, ఎస్సార్ ప్రైమ్‌కు చెందిన అదితినందా, రెండో బహుమతి సాధించింది. కేవీ వరంగల్‌కు చెందిన రిషిక, రిషిత, సూర్యసేన్, జవహర్ నవోదయ పాఠశాలకు చెందిన సౌరబ్ మిత్రాలు గెలుపొందగా విజేతలకు బహుమతులను నిట్ ప్రొఫెసర్ జి.రమణరావు అందజేశారు.

అలుమిని హాల్ అభివృద్ధికి విరాళం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగంలో అలుమిని హాల్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆ విభాగం పూర్వ విద్యార్థి కేయూ రిటైర్డ్ ఆచార్యులు జి.వీరన్న శుక్రవారం అభివృద్ధి పనులకు రూ.50వేల చెక్కును విరాళంగా ఆ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ రాజనీతిశాస్త్ర విభాగం అభివృద్ధికి కోసం తనవంతుగా సహకారం అందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని తెలిపారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

కేయూ క్యాంపస్ : విద్యార్థులకు శుద్ధమైన తాగు నీటిని అందించేందుకు కాకతీయ యూనివర్సిటీలోని కామన్ మెస్‌లో, పద్మాక్షి మహిళా హాస్టల్ మెస్ వద్ద ఆర్ఓ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. బాలవికాస రూ. 5 లక్షలు, కేయూ రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ. 10 లక్షలతో క్యాంపస్‌లో వివిధ చోట్ల 9 ఆర్ఓ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

యూనిఫామ్‌తో పని ప్రదేశంలో గుర్తింపు

యూనిఫామ్‌తో పని ప్రదేశంలో ఉద్యోగులకు ఒక గుర్తింపుగా ఉంటుందని వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలోని ఉద్యోగులకు యూనిఫామ్‌లను ఆయన పంపిణీ చేశారు.

టోర్నమెంట్స్‌లో ఉద్యోగుల జోష్

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే స్టేడియంలో 10 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్స్ రైల్వే ఉద్యోగుల్లో ఫుల్ జోష్ నింపుతుంది. శుక్రవారం ఫస్ట్ మ్యాచ్‌ని బెల్లంపల్లి లోకోస్టార్-రైల్వే ఇనిస్టిట్యూట్ జట్ల మధ్య పోటీని రైల్వే మజ్దూర్ యూనియన్ డిజిల్‌షెడ్ బ్రాంచీ సెక్రటరి పాక వేదప్రకాష్, లోకోరన్నింగ్ బ్రాంచీ చైర్మన్ సంగ రమేష్, సెక్రటరీ సాయికుమార్, రైల్వే మ జ్దూర్ యూత్ కోఆర్డినేటర్ బిజ్జ శివలు కలిసి ప్రారంభించి మాట్లాడారు. సెకండ్ మ్యాచ్‌ని సికింద్రాబాద్ సీ అండ్‌డబ్ల్యూ-ఆర్‌పీఎఫ్ జట్ల మధ్య పోటీని హైకోర్టు న్యాయవాది రావు అమరేందర్‌రెడ్డి, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గుర్రపు సుధాకర్‌రావు క్రీడను ప్రారంభించి మాట్లాడారు. నేడు ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముస్తాబవుతున్న కోట

- గణతంత్ర వేడుకలకు ఘనమైన ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్: రేపు (ఆదివారం) జరుగనున్న గణతంత్ర వేడుకలకు చారిత్రక ప్రసిద్ధి చెందిన వరంగల్ కోట ముస్తాబవుతుంది. జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశాల ప్రకారం శుక్రవారం ఉదయం వేడుకల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఖుషిమహల్ మైదానం పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివిధ శాఖల అధికారులకు అప్పగించిన పనులను పరిశీలిస్తూ వేగవంతగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శకటాలు ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలకు పోలీసుల పరేడు, గౌరవ వందన స్వీకారానికి ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే బారీగేడ్లకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. దీంతో కోట మరింత అందంగా ముస్తాబవుతోంది.

వర్షాకాలం నాటికి ముంపు నివారణ

- ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి



నాలా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ: వర్షాకాలం నాటికి గోకుల్‌నగర్ ముంపును నివారించనున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ గోకుల్ కూడలిలో రూ.5.50 కోట్లతో నిర్మించనున్న నాలా నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా వర్షాకాలంలో గోకుల్ నగర్ జంక్షన్ నుంచి గాంధీనగర్ ప్రధాన రహదారిలో వరద నీరు నిలిచి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సమస్యను తాను స్వయంగా చూసి చలించి స్మార్ట్ సిటీ నిధులు రూ.5.50 కోట్లతో నాలా నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, కార్పొరేటర్ నల్ల స్వరూప రాణి, గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్, నాయకులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలందరికీ పథకాలు



మడికొండ: దరఖాస్తులను స్వీకరిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



హన్మకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎంపీడీఓ కర్ణాకర్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్ : అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలో, 57, 58వ డివిజన్లలో, హసన్‌పర్తి, కాజీపేట అర్బన్ ప్రాంతాల్లో జరిగిన నిర్వహించిన ప్రజాపాలన సభల్లో ఎమ్మెల్యేలు, ఎంపీడీఓ, కార్పొరేటర్లు పాల్గొని పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం జనవరి 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేయబోతుందన్నారు. ప్రతీ ఒక్కరికి పథకాల గురించి వివరించడానికే వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు అనర్హులను ఎంపిక చేయొద్దని ఎలాంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక, గుర్తింపు కోసం ఎవరికి డబ్బులు ఇవ్వొద్దన్నారు. అన్యాయం జరిగితే తనను సంప్రదించాలన్నారు. మడికొండలో డంపింగ్ యార్డు సమస్యపై బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు గద్దం మహేందర్ ఎమ్మెల్యే నాగరాజును ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డంపింగ్ యార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మడికొండకు రూ. 3.50లక్షలతో స్మార్ట్ సిటీ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మడికొండ ప్రజల కోసం బస్తీ దవాఖానాకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. జెడ్పీ సీఈఓ విద్యాలత, తహసీల్దార్లు, కార్పొరేటర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మడికొండ: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మడికొండకు చెందిన పొట్లబత్తిని వెంకటమ్మ ఈనెల 18న మడికొండలోని వేణుగోపాల స్వామి ఆలయం వద్దకు ఇంటికి తాళం వేసి తిరిగి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూసేసరికి బంగారం, దాచిన డబ్బులు బయటకు తీసినట్లు ఉంది. ఇంట్లో వెతకగా ఎక్కడా కనిపించక పోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దొంగిలించిన వాటి విలువ సుమారుగా రూ.1.36,000 ఉంటుందని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుట్కా అమ్ముతున్న వ్యక్తిపై కేసు

మడికొండ : ప్రభుత్వం నిషేధించిన పొగాకు గుట్కాలను అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మడికొండ సీఐ కిషన్ తెలిపారు. సీఐ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్‌తో శుక్రవారం పెట్రోలింగ్‌కు తరాలపల్లికి వెళ్లగా గ్రామానికి చెందిన సిరిమల్ల ప్రవీణ్ తన కిరాణం షాపులో గుట్కాలను అమ్ముతుండగా పట్టుకొని విచారించారు. గుర్తుతెలియని వారి దగ్గర నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిసి అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గుట్కాలను సిజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

వరంగల్ : ఆరెపల్లి అయ్యప్ప దేవాలయం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంప్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏనుమాముల చాకలి ఐలమ్మ నగర్‌కు చెందిన శ్రీరామోజు సాయికుమార్‌కు గాయాలు కావడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఏనుమాముల సీఐ ఏ.రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరకాలలో వెల్డింగ్ పనులు ముగించుకుని మోటార్‌సైకిల్‌పై వస్తున్న క్రమంలో అయ్యప్ప టెంపుల్ సమీపంలో టాటా ఏస్ ట్రాలీ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో సాయికుమార్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. సాయికుమార్ తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిషన్ తెలిపారు.

నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

- డీటీసీ శ్రీనివాస్



మాట్లాడుతున్న డీటీసీ శ్రీనివాస్, పక్కన డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి : రోడ్డుభద్రతపై అవగాహన లేని కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్టు కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ పాఠశాలల విద్యార్థులకు హనుమకొండలోని లష్కర్‌బజార్ బాలికోన్నత పాఠశాలలో రోడ్డుభద్రతపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత జిల్లాస్థాయిలో విద్యార్థులకు రోడ్డుభద్రతపై ఉపన్యాస, వ్యాసరచన స్కిట్, క్విజ్ పోటీలను నిర్వహించారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డుభద్రతపై పరిపూర్ణ అవగాహన కలిగి తమ కుటుంబాలను రక్షించుకోవచ్చునని తెలిపారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, హనమకొండ ఎంఈఓ నెహ్రూనాయక్, జీహెచ్ఎం ఉమాదేవి, సోషల్‌ఫోరం బాధ్యులు పాల్గొన్నారు. విజేతలకు 26న రిపబ్లిర్ డే పరేడ్ మైదానంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేస్తారు.

నిట్‌లో నేషనల్ వర్క్‌షాప్

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో డిస్కవరీ స్పేరిట రెండు రోజుల వర్క్‌షాప్‌ను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. స్ట్రక్చర్ మెటీరియల్స్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్స్ ఇన్ స్టీల్ కాంక్రిట్ అండ్ క్యూఏ సిస్టమ్స్ అనే అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో టాటా స్టీల్ స్రామాట్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు, నిట్ ప్రొఫెసర్ కిషోర్‌కుమార్‌లు పాల్గొన్నారు. నిర్మాణాత్మక పదార్థాలపై నూతన ఆవిష్కరణలు చేపట్టేందుకు చేపట్టాల్సిన పరిశోధనలపై చర్చించారు.

పథకాలు అందరికీ అందించాలి

వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభలలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ పథకాల లిస్టుల్లో పేరు రాని వాళ్లు మళ్లీ దరఖాస్తులు పెడుతున్నారని వాటన్నింటిని పరిశీలించి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.